క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ చైర్‌పర్సన్



మడకశిరరూరల్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం మడకశిర మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ జయపద్మ కుటుంబ సభ్యులు కలిశారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు జయపద్మ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



అనంతపురం జిల్లా ప్రిన్సిపల్ జడ్జిని కలిసిన హిందూపురం బార్ అసోసియేషన్ సభ్యులు

హిందూపురం: పట్టణంలో ఉన్న కోర్టు సమస్యలను పరిష్కరించాలని అనంతపురం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఈ.భీమరావును కలిసి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వన్నూరప్ప, న్యాయవాదులు కోరారు. జిల్లా ప్రిన్సిపల్ జడ్జిని బుధవారం న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. హిందూపురం కోర్టులోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. హిందూపురం కోర్ట్ ప్రాంగణంలో ఉన్న పాత బిల్డింగ్స్‌ను తీసివేసి కొత్త భవనాల నిర్మాణంతో పాటు ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ మెజిస్ట్రేట్‌ను నియమించాలని కోరారు. కొత్త బిల్డింగ్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యపై ప్రిన్సిపల్ జడ్జి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శివశంకర్, ఆల్ ఇండియా బార్ అసోసియేషన్ సభ్యులు ఆలూరు రామిరెడ్డి, కదిరీష్, గుమస్తా సాయినంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు



ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: పట్టుదలతోనే విద్యార్థులు లక్ష్యాన్ని సాధించవచ్చని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు మంత్రి ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కృషి, పట్టుదలతో బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు.
పెనుకొండ: పెనుకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మినీ మహానాడు జరిగింది. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి, వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు వేయించామని, అమృత్ పథకం కింద పెనుకొండ మునిసిపాలిటీకి వంద కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందిస్తామన్నారు. రాంపురం సమీపంలో బీసీ హాస్టల్ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, పరిశీలకులు నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ముసలప్ప కుంటను కాపాడండి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ: తాలూకాలోని సీకే పురం గ్రామంలోని ముసలప్పకుంట అన్యాక్రాంతమై క్షీణ దశకు చేరిందని, వెంటనే రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టి ముసలప్ప కుంటను కాపాడాలని స్థానిక కర్ణాటక రాజ్య జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. గతంలో ముసలప్పకుంట నీటితో కళకళలాడుతూ ఎంతో మంది రైతులతో పాటు జంతువులు, పశుపక్షాదులకు దాహం తీర్చేదన్నారు. కబ్జాదారుల ఆక్రమణలతో నేడు అధ్వానంగా మారిందన్నారు. కబ్జాదారుల హస్తాల నుంచి ముసలప్ప కుంట భూమిని తీసుకొని మళ్లీ పునరుద్ధరించాలన్నారు. అనంతరం ఉప తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

గతుకుల రోడ్లే గతి !

- సంక్రాంతికి రోడ్లన్నీ బాగు చేస్తామని మాటతప్పిన సీఎం బాబు
- అధ్వానమైన రహదారులతో ప్రజల అవస్థలు



అధ్వానంగా ఉన్న శ్రీరంగరాజుపల్లి - పరిగి రోడ్డు

పరిగి: సంక్రాంతి పండగలోపే రాష్ట్రంలోని రోడ్లన్నీ బాగు చేస్తామని గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఇచ్చిన హామీ అటకెక్కింది. సంక్రాంతి పండుగ పోయి ఐదునెలలకు పైగా అవుతున్నా రోడ్ల పరిస్థితిలో ఏ మార్పులేదని ప్రజలు వాపోతున్నారు. పరిగి మండలంలో మొత్తం 46 గ్రామాలు ఉన్నాయి. రోడ్లు సరిగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నా తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారే తప్ప శాశ్వత పనులు చేపట్టడం లేదంటున్నారు.



ముళ్ల పొదలు, పిచ్చి చెట్లతో నిండిన ఊటుకూరు రోడ్డు



కంకర తేలిన ఆనందపాళ్యం రోడ్డు



శాసనకోట రోడ్డుపై పడిపోవడంతో బురద తుడుచుకుంటున్న బాలుడు

మా రోడ్ల దుస్థితి మారదా ?



నిత్యం ఆనందపాళ్యం నుంచి మోదా మీదుగా పరిగి, హిందూపురం ప్రాంతాలకు వందలాదిగా పెయింటింగ్, తాపీ మేస్త్రీ కూలీ పనులతో పాటు గార్మెంట్స్‌కు వెళ్తుంటాము. ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్నప్పుడు జరిగిన ప్రమాదాల్లో గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన సంఘటనలున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్రాంతిలోపు రోడ్లు నిర్మిస్తామన్న మాటను సీఎం చంద్రబాబు నిలుపుకోవాలి. – ఆనంద్, ఆనందపాళ్యం

ప్రాణాలు పోతున్నా పట్టదా?



మేము శ్రీరంగరాజుపల్లి నుంచి నిత్యం ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తుంటాము. అడుగుకో గుంత ఉన్న రోడ్డుపై ప్రయాణాన్ని సాగించలేకపోతున్నాము. అనేక మార్లు ఆటో బోల్తా పడిన సంఘటనలున్నాయి. మూడు కిలోమీటర్ల దూరాన్ని 30 నిమిషాలు ప్రయాణించాల్సివస్తోంది. అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. – రామాంజిమ్మ, గార్మెంట్స్ కార్మికురాలు

ఆటో తిప్పడం భారమైంది



శ్రీరంగరాజుపల్లి నుంచి ఆటోలో నిత్యం ప్రయాణం సాగిస్తుంటాను. రోడ్డు సరిగా లేకపోవడంతో ఆటో నిర్వహణ భారంగా మారింది. గుంతల రోడ్లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో కూడా తెలీని పరిస్థితి నెలకొంది. తప్పని సరిగా కుటుంబ జీవనానికి భారాన్ని భరిస్తున్నా. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు రోడ్ల నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నాను. – సోమశేఖర్, డ్రైవర్

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం

- వివిధ మండలాలకు కమిటీల ఎంపిక



గోరంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు వైఎస్సార్‌సీపీ మండల నూతన కమిటీని బుధవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ ఎంపిక చేసింది. మండల కన్వీనర్‌గా పగడాల వెంకటేష్ , మండల ఉపాధ్యక్షుడిగా ఆదినారాయణ, వాసునాయక్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా హేమసుందర్‌రెడ్డి, గాజుల శ్రీనివాసులు, అశ్వర్థరెడ్డి, మంజునాథ, హరిజన రామణప్ప, కార్యదర్శులుగా గంగాధర్, బెస్త బాలకృష్ణను ఎంపిక చేశారు. కమిటీ మెంబర్లుగా నాగరాజు, బోయ ఈశ్వరప్ప, హరి, రాజు, కె. ఆనంద్ , మహమ్మద్ రఫీ, ముసలిరెడ్డి, నాగేంద్ర, వీర నరసింహప్ప, శంకర్, లక్ష్మీనారాయణరెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖరరెడ్డిలను నియమించారు.

మడకశిర మండలం

మడకశిరరూరల్: వైఎస్సార్‌సీపీ మడకశిర మండల వైస్ ప్రెసిడెంట్లుగా దశనాథ్‌రెడ్డి, నరసింహమూర్తి, జనరల్ సెక్రటరీలుగా హనుమంతరాయప్ప, రాజు, తిప్పేస్వామి, నరేష్‌రెడ్డిలను ఎంపిక చేశారు. సెక్రటరీలుగా హనుమంతగౌడ్, యుగంధర్, దేవరాజు, శివకుమార్, కేపీ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కెంచప్ప, హరి, జయప్ప , సత్యనారాయణ, తిప్పేస్వామి, కరియన్న, భరత్‌కుమార్, బాల్‌రెడ్డి, వెంకటేశు, బసప్ప, శాంతకుమార్, నరసేగౌడ్, శేషాద్రి, గంగాధర్‌బాబు, మంజునాథ, జేపీ నరసారెడ్డిని ఎంపిక చేశారు.

రొళ్ల మండలం

రొళ్ల: వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్లుగా నగేష్‌గౌడ, ఆనంద్, జనరల్ సెక్రటరీలుగా మంజునాథ్, శ్రీనివాసులు, దేవరాజు, లోకేష్, సెక్రటరీలుగా శివన్న, క్రిష్టారెడ్డి, శ్రీనివాసులు, జయప్ప, రంగారెడ్డిలను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మారన్న, విజయరంగేగౌడ్, హిమాచల, ప్రకాష్ , ముద్దారెడ్డి, లోకేష్, సంతోష్ , రఘువీర్, ఎల్. శివగంగ, ప్రసన్నకుమార్‌ను ఎంపిక చేశారు.

అగళి మండలం

అగళి: వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్లుగా భోజరాజు, శివరాజు, జనరల్ సెక్రటరీలుగా శ్రీనివాసులు, నాగేంద్ర, మంజునాథ, మరన్నలను నియమించారు. అలాగే సెక్రటరీలు కొండ నాగరాజు, చంద్రన్న, హరీష్ , గంగన్న ,ఈశ్వరప్ప, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కోలి నాగరాజు, ముద్దరాజు, వసంత కుమార్, మైలరప్ప, నారాయణప్ప, ఎస్‌వీ రామచంద్రప్ప, గుజ్జరప్ప, సదనంద ఆరద్య స్వామి, తిమ్మరాజు, మారన్న, దినేష్, పవన్, లక్ష్మీ నరసప్ప నియమితులయ్యారు.

అమరాపురం మండలం

అమరాపురం: వైఎస్సార్‌సీపీ మండల వైస్ ప్రెసిడెంట్లుగా నబీ రసూల్, శివన్న, జనరల్ సెక్రటరీలుగా వెంకటరమణప్ప, ఈరన్న, నారాయణప్ప, మనోహర్, సెక్రటరీలుగా దివాకర్, మంజునాథ, , నరసింహమూర్తి, జేసీబీ శివలింగప్ప, భీమరాజు నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రవి, జోగింద్ర, జె. పాండురంగప్ప, నాగన్న, ఓ.నరసింహరాజు, చిత్తయ్య, హనుమంతరాయప్ప, నంజుండప్ప, ఈరన్న, కేటీ క్రిష్ణ , పీబీ హితేంద్రలను ఎంపిక చేశారు.

ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని చందకచెర్లు గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు బుధవారం పూజ కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. పురోహితులు వేదాపారాయణం, మృత్సంగ్రహణం, అంకురాపణాంగ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలకరించి వివిధ పూజలు చేశారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారికి జ్యోతులు, మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మమ్మ

మడకశిర: మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు చైర్ పర్సన్‌గా ఉన్న లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి పదవి నుంచి దించారు. ఈ నేపథ్యంలో వైస్ చైర్ పర్సన్‌గా ఉన్న వెంకటలక్ష్మమ్మను ఇన్‌చార్జ్ చైర్ పర్సన్‌గా నియమించారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడండి



గుడిబండలో కళ్లకు గంతలు కట్టుకుని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంతో మంది నిరుపేదలకు ఆసరాగా ఉన్న ఆర్డీటీ సేవలకు అంతరాయం కలిగించకుండా ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని సర్పంచ్ కరుణాకర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో కళ్లకు గంతలు కట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఆర్డీటీ సేవలు ఆగిపోతే పేదలందరూ నష్టపోవాల్సి వస్తుందన్నారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం: దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశ పురోగతికి ఎన్నో సంస్కరణలు చేశారని హిందూపురం కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు ఎస్ జమీల్ ఆధ్వర్యంలో రహమత్ పురం సర్కిల్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవూఫ్, యూనుస్, సమీవుల్లా, పీరు సాబ్, సమీవుల్లా, ఎండీ గౌస్, ఫయాజ్, తిరుపాల్, గంగాధారప్ప, వెంకటేష్, పులిమితి ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగళి, రొళ్లలో ‘తిరంగా యాత్ర’



రొళ్లలో మానవహారంగా ఏర్పడిన ఉద్యోగులు, నాయకులు



అగళిలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

రొళ్ల: ‘ఆపరేషన్ సింధూర్’ విజయాన్ని పురస్కరించుకుని సైనికులకు సంఘీభావంగా మండల కేంద్రంలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం తిరంగా యాత్ర నిర్వహించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో సైనికులకు, మాజీ సైనికులకు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్షావలి, ఎంఈఓ శ్రీధర్, కార్యదర్శి బాబురావు, జమెదార్ రామలింగయ్య, వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, బీజేపీ నాయకుడు ముద్దరాజు తదితరులు పాల్గొన్నారు.
అగళి: ఆపరేషన్ సింధూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అగళిలో కూటమి నాయకులు, ఉపాధి సిబ్బంది సైనికులకు మద్దతుగా జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ నరసింహారెడ్డి

రొళ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాల వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు ధ్వజమెత్తారు. బుధవారం మధ్యాహ్నం రొళ్ల పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. రేషనలైజేషన్ పేరుతో సచివాలయాల్లో పనిచేస్తున్న రెవెన్యూ కార్యదర్శులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కూటమి సర్కార్ జీఓ ఎంఎస్ నంబర్–4 విడుదల చేసి రెండు సచివాలయాలకు ఒక వీఆర్వో ఉండే విధంగా చర్యలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థ పూర్తిగా విస్మరించడమే కాకుండా రేషన్ డెలివరీ చేసే ఎండీయూ ఆపరేటర్లను కూడా తొలగించడానికి సన్నద్ధం కావడం సిగ్గు చేటని విమర్శించారు. దీంతో వెంటనే జీఓ ఎంఎస్ నంబర్–4 రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి, నాయకుడు మహంతేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించడం అన్యాయం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుడిబండ: తమ జీవితాలను రోడ్డున పడకుండా తమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం పున: పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఎండీయూ మండల ఆపరేటర్లు డిమాండ్ చేశారు. బుధవారం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణి చక్రవర్తికి వినతిపత్రం అందించారు. ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడుతూ తమకు ఇంకా 20 నెలల కాల వ్యవధి ఉండగా ఉన్న ఫళంగా తమను విధుల నుంచి తొలగించడం అన్యాయన్నారు. ప్రభుత్వం ఇతర శాఖల్లోనైనా ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్, రవికుమార్, మహేంద్ర గుప్త, వెంకటేష్, గోపాల్‌నాయక్, రంగస్వామి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోండి

సోమందేపల్లి: మండల పరిధిలో ఉన్న సోమన్నపల్లి గ్రామంలో గురువారం నిర్వహించనున్న హనుమాన్ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. ఈ విషయంపై బుధవారం సాయంత్రం సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మత పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే ర్యాలీని శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

సోమందేపల్లి: మండల పరిధిలోని జూలకుంట, మండ్లీ గ్రామాల్లో ఉన్న సచివాలయాలను ఎంపీడీఓ వెంకట లక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సచివాయాల ద్వారా ప్రజలకు అందే సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బ్రాహ్మణపల్లి వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు పనులు కల్పించడంతో పాటు సకాలంలో వేతనాలు అందేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	31.0
పెనుకొండ	34.0
మడకశిర	31.0

కల్వర్టులోకి దూసుకెళ్లిన బొలెరో



రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు సమీపంలో మడకశిర–పెనుకొండ ప్రధాన రహదారిపై బొలెరో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ఆనంద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గ్రామస్తుల వివరాలమేరకు.. మంగళవారం రాత్రి పావగడ నుంచి బెంగళూరుకు వెళుతున్న బొలెరో పెద్దమంతూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లిందన్నారు. ప్రాణాపాయం నుంచి డ్రైవర్ ఆనంద్ త్రుటిలో తప్పించుకున్నాడన్నారు. కల్వర్టు నిర్మాణం పనులు చేస్తున్న కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు ఇక్కడ పనులు జరుగుతున్నట్లు ఎలాంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి అవకాశం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలోని సేవామందిరంలో ఉన్న ప్రభుత్వ బాల బాలికల అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు జరుగుతున్నట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు బి వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గానూ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఆయా తరగతుల్లో తగిన అర్హతల ఆధారంగా ప్రవేశం పొందవచ్చన్నారు. ఎలాంటి డొనేషన్ లేకుండా పూర్తిగా ఉచిత విద్యను అందించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 80088 89815ను సంప్రదించాలని కోరారు.

‘ఈరలక్కప్పను విమర్శించే స్థాయి నీకు లేదు’

అమరాపురం: మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను విమర్శించేస్థాయి ప్రస్తుత జడ్పీటీసీ స్వారక్క భర్త నరసింహమూర్తికి లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శివన్న, కుంచిటి వక్కలిగ సంఘం మాజీ రాష్ట్ర డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు శివకుమార్, ఎంపీటీసీ నారాయణ అన్నారు. బుధవారం వారు అమరాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మడకశిరలో టీడీపీ నిర్వహించిన మినీ మహానాడులో జడ్పీటీసీ స్వారక్క భర్త నరసింహమూర్తి ... ఈరలక్కప్పపై పరుష పదజాలంతో మాట్లాడిన మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీకి వెళ్లి.. ఎవరి మెప్పుకోసమో ఇష్టారీతిలో మాట్లాడటం సరికాదన్నారు. గత ఎన్నికల్లో అతి తక్కువ మెజార్టీతో ఓడిపోయిన ఈరలక్కప్పపై విమర్శలు తగవన్నారు.

యోగా తరగతులు సద్వినియోగం చేసుకోండి



యోగాపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

పెనుకొండ రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న యోగా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్ సూచించారు. జూన్ 21వ తేదీ వరకూ రోజూ ఉదయం 6:30 నుంచి 7: 30 గంటల వరకూ జూనియర్ కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించే యోగా శిక్షణ తరగతులను ప్రజలు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ నరేష్ కృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్ష తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల ఆవరణలో జరుగుతున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను ఎంఈఓ శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. పరీక్ష రాయడానికి ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు.